క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

హుస్నాబాద్: ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11.30ని.ల నుంచి మధ్యాహ్నం 12.30ని.ల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఏమైనా సమస్యలు **7382852772** నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని, అలాగే సలహాలు, సూచ నలు తెలియజేయాలని కోరారు. హుస్నాబాద్ నుంచి బాసర, భద్రాచలం పుణ్యక్షేత్రాలకు శుక్రవారం నుంచి రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించనున్నట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

వ్యాయామం తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

హుస్నాబాద్: డయాబెటిక్ దినోత్సవం సందర్భంగా సురక్ష ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఎల్లమ్మ చెరువు కట్టపై రన్నర్స్, స్విమ్మర్లకు షుగర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పిట్ల రాజు, డాక్టర్ అనిత నాయక్ మాట్లాడుతూ ప్రతిరోజు విధిగా వ్యాయామం చేయాలన్నారు. మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండాలని, ఫాస్ట్‌ఫుడ్ తీసుకోవద్దని సూచించారు. అతి మూత్రం, అతి దాహం, క్రమంగా బరువు తగ్గడం, అతిగా ఆకలి అవడం వంటి లక్షణాలు ఉన్న వారు తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. 65మందికి డయాబెటిక్ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించారు.

శాంతి భద్రతలకు విఘాతం



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతోందని, అది ఓర్వలేక బీఆర్‌ఎస్ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు కుట్రలు చేస్తుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు అన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. అభివృద్ధిని అడ్డుకోవడానికి కేటీఆర్, హరీశ్‌రావు కుట్రలు చేస్తున్నారన్నారు. ఎన్నికుట్రలు చేసినా అభివృద్ధిని అడ్డుకోలేరని చెప్పారు. రైతుల ముసుగులో గూండాలు దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో జిల్లా నాయకులు రాజ్‌వీర్, అశోక్, జయంత్, రాజు, స్వామి పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ నాగేందర్‌రెడ్డి

మర్కూక్(గజ్వేల్): రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలలలోనే విక్రయించాలని మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి సూచించారు. మండలంలోని వర్ధారాజ్‌పూర్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. వడ్లను ఆరబెట్టిన తర్వాత కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.

జక్కాపూర్ విద్యార్థినికి సత్కారం

సిద్దిపేటరూరల్: కథల పోటీల్లో ప్రతిభ కనబరిచిన జక్కాపూర్ పాఠశాల విద్యార్థిని బోయిని నందినిని గురువారం తెలంగాణ విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సత్కరించి, రూ.1500 నగదు పురస్కారాన్ని అందించినట్లు హెచ్‌ఎం షౌకత్ అలీ తెలిపారు. సాహిత్య సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిందని, ప్రముఖ కవి అందెశ్రీ చేతుల మీదుగా జ్ఞాపికను అందుకున్నట్లు చెప్పారు.

ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ



పరామర్శిస్తున్న వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో పనిచేస్తున్న పంచాయతీ కార్మికురాలు ఎర్మని ఎల్లవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5వేలు అందజేశారు. ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఆయన వెంట వడ్ల ప్రభాకర్, ఐతం శ్రీనివాస్, ఇంద్రం, పర్స స్వామి, నంద్యాల బాలకిషన్, బాలాచారి తదితరులు ఉన్నారు.



హుస్నాబాద్: నెహ్రూ విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్ రజిత



జగదేవ్‌పూర్(గజ్వేల్): తిగుల్ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

నేటి బాలలే రేపటి పౌరులు

బాలల దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గౌరవార్థం నవంబర్ 14న జరిపే ఈ దినోత్సవాన్ని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాలయాలు, వివిధ పార్టీల కార్యాలయాల్లోను వేడుకగా జరుపుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, నేతలు నెహ్రూ చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, పాటలు, వ్యాస రచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, దేశ భవిష్యత్ చిన్నారులపైనే ఆధారపడి ఉందని ఆకాంక్షించారు.



చిన్నకోడూరు(సిద్దిపేట): రామంచలో విద్యార్థులకు బహుమతుల పంపిణీ



హుస్నాబాద్: విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న అధ్యాపకులు



కోహెడ(హుస్నాబాద్): ఉపాధ్యాయులుగా విద్యార్థులు



బెజ్జంకిలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు



సిద్దిపేటజోన్: చిన్నారులతో సీఐ దుర్గ



దుబ్బాక: మొక్క నాటుతున్న విద్యార్థులు



మిరుదొడ్డి(దుబ్బాక): బుక్స్ అందజేస్తున్న ఎంఈఓ

ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి..

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



ల్యాబ్‌ను ప్రారంభించిన డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ఇష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరగలరని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని దుద్దెడ హైస్కూల్లో బాలల దినోత్సవం సందర్భంగా డ్రాయింగ్ పోటీల విజేతలకు గురువారం బహుమతులు అందజేశారు. అనంతరం ఇంగ్లిష్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత ఖర్చులతో ఆంగ్లమాధ్యమ బోధన కోసం ఉపయోగపడే పుస్తకాలను ఉపాధ్యాయురాలు కిరణ్మయి అందజేయడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మి, ఉపాధ్యాయుడు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో గుర్తింపు

హుస్నాబాద్: విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, విద్యార్థి దశ చాలా కీలకమని సీఐ శ్రీనివాస్ అన్నారు. అపోలో ఒకేషనల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు గురువారం మహిళల రక్షణకు ఉన్న చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గణేశ్, అధ్యాపకులు, షీటీమ్ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

గజ్వేల్ రూరల్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ మురళి హెచ్చరించారు. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాల్ పరిధిలోని ప్రధాన చౌరస్తాల వద్ద ఇటీవల నిర్వహించిన వాహనాల తనిఖీల్లో 30 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని గురువారం కోర్టులో హాజరు పర్చగా జడ్జి ప్రియాంక రూ.23వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజన చార్జీలను పెంచండి

ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి భరత్

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్నభోజన నిర్వహణకు అవసరమైన చార్జీలను పెంచాలని ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కార్యదర్శి తాడూరి భరత్ కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట గురువారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఈఓ రమేశ్‌కు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా చార్జీలు పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడంలేదన్నారు. మండలంలోని కొన్ని పాఠశాలలలో తాగునీరు, టాయిలెట్ల నిర్వహణ సరిగా లేదని వెంటనే ఆయా పాఠశాలలో అధికారులు తాగునీటి వసతి కల్పించాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి పాఠశాలల పనితీరును మెరుగుపరుచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విక్రమ్, సమీర్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నైతిక విలువలు ముఖ్యం


న్యాయమూర్తి స్వాతిరెడ్డి



చిన్నారులతో జడ్జి స్వాతిరెడ్డి

సిద్దిపేటజోన్: విద్యార్థులు నైతిక విలువలు, క్రమశిక్షణతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి పిలుపునిచ్చారు. బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక అంబిటస్ స్కూల్‌లో గురువారం బాలల హక్కులు, చట్టాలు గురించి వివరించారు. పిల్లలకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జ్యోతిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల తనిఖీ



రవీందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధ్యాపకులు

దౌల్తాబాద్(దుబ్బాక): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను సిద్దిపేట జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయనను అధ్యాపకులు సన్మానించారు. ప్రిన్సిపాల్ మధు శ్రీవాస్తవ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని గాగ్గిల్లాపూర్ గ్రామానికి చెందిన తాపీమేస్త్రీ గండు నరహరి వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో అతడి కుటుంబానికి భవన కార్మిక సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.25వేలు సహాయం అందజేసింది. వల్లంపట్ల, రేబర్తి, లద్నూర్, గాగ్గిల్లాపూర్ గ్రామాలకు చెందిన కార్మికులు పాల్గొన్నారు.

◆ **గ్రంథాలయాల అభివృద్ధి కోసం వినతి**

దుబ్బాకటౌన్: నియోజకవర్గంలోని గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలని కోరుతూ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తికి తెలంగాణ జన సమితి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కేసరి స్వామి ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిరుదొడ్డి, దుబ్బాక లైబ్రరీలలో మౌలిక వసతుల కల్పించాలన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ నాయకులు ప్రవీణ్, వెంకటేశం తదితరులు ఉన్నారు.

◆ **డివిజన్ ఏర్పాటులో జాప్యం తగదు**

కొమురవెల్లి(సిద్దిపేట): చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ నేతలు ఎందుకు జాప్యం చేస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి తాడూరి రవీందర్ ప్రశ్నించారు. స్థానిక కార్యాలయంలో గురువారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఇస్తారి, బాలకిషన్, భిక్షపతి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ **పెద్దమ్మ తల్లి ఆభరణాల చోరీ**

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వరికోలలోని పెద్దమ్మఆలయంలో బుధవారం చోరీ జరిగింది. ఎస్‌ఐ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని పెద్దమ్మ ఆలయంలో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఆలయం తలుపులు పగలగొట్టి హుండీలోని నగదుతో పాటు అమ్మవారి పుస్తెలు, మట్టెలు ముక్కుపుడకను అపహరించారు. వాటి విలువ సమారు రూ.15వేలు ఉంటుందని పూజారి కూన పోచయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

◆ **అధికారుల నిర్లక్ష్యం**

హుస్నాబాద్‌రూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. గురువారం పోతారం(ఎస్)లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యల గురించి తెలుసుకున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కొనుగోళ్లు నిలిచిపోతున్నాయని వాపోయారు. అధికారులు రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

◆ **కానిస్టేబుల్ నవీన్ మృతి బాధాకరం**

దుబ్బాక: రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ నవీన్ మృతి బాధాకరమని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మండలంలోని రామక్కపేటలో కానిస్టేబుల్ నవీన్ కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించి ఓదార్చారు. ఇటీవల అనారోగ్యానికి గురైన 15వ వార్డు కౌన్సిలర్ భర్త, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పల్లె రామస్వామిగౌడ్‌ను పరామర్శించారు.

◆ **మట్టి టిప్పర్ల స్వాధీనం**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్) శివారులో జరుగుతున్న మట్టి తవ్వకాలపై అందిన ఫిర్యాదుల మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టి మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకున్నారు.ఓవర్ లోడుతో రాకపోకలు సాగిస్తున్న వాహనాల వల్ల రోడ్లు దెబ్బతింటున్నాయని, అందుకే ఆ వాహనాలను స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ రవీందర్‌రెడ్డి చెప్పారు.

◆ **విద్యాదానం గొప్పది**

కొండపాక(గజ్వేల్): అన్ని దానాల కంటే విద్యాదానం గొప్పదని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. కుకునూరుపల్లి మండలంలోని చిన్న కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు ప్రశాంత్ కుమార్ సహకారంతో గురువారం విద్యార్థులకు నోట్ బుక్స్, స్టడీ మెటీరియల్ అందజేశారు.హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ **ఉపాధ్యాయుల కృషి అవసరం**

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీస్తూనే ఉత్తమ ఫలితాల సాధనకు ప్రతి ఉపాధ్యాయుడు పాటు పడాలని దుబ్బాక నియోజకవర్గంలోని ఏఈఓలు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. మిరుదొడ్డిలోని మోడల్ స్కూల్‌లో గురువారం నియోజవర్గంలోని హెచ్‌ఎంలతో కలిసి నామినల్ రూల్ సమావేశం నిర్వహించారు. ఎంఈఓలు ప్రవీణ్‌బాబు, జోగు ప్రభుదాసు, అంజయ్య, నర్సవ్వ పాల్గొన్నారు.

ఒంటికైనా.. రెంటికైనా ఇంటికే..

- పాఠశాలలో టాయిలెట్స్ లేక అవస్థలు
- మధ్యలోనే నిలిచిపోయిన పనులు



మధ్యలో నిలిచిపోయిన నిర్మాణం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వింజపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో కనీస సదుపాయాలు కరువయ్యాయి. పాఠశాలలో సుమారు 40 మందికిపైగా విద్యార్థులు చదువుతున్నారు. ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న వారికి మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకోవడంతో ఒకటికైనా.. రెంటికైనా ఇంటికెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. లేదా చెట్ల పొదలను ఆశ్రయించాల్సిందేనని విద్యార్థులు వాపోతున్నారు. రెండేళ్ల క్రితం అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా టాయిలెట్‌లు, నీటి సౌకర్యం, విద్యుత్, సీలింగ్ ఫ్యాన్‌ల కోసం రూ.8లక్షలు మంజూరయ్యాయి. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరుగుదొడ్లు వినియోగంలో వచ్చేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే సహకార సంఘం ధ్యేయం

హుస్నాబాద్/తొగుట(దుబ్బాక)/కోహెడ(హుస్నాబాద్): రైతు సంక్షేమమే ధ్యేయంగా సహకార సంఘం పని చేస్తోందని సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య అన్నారు. అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా గురువారం విశాల పరపతి సహకారం సంఘ కార్యాలయంలో ఆయన జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎరువులు, విత్తనాలు అందిస్తున్నామని, రైతుల వద్ద నుంచి ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తున్నామన్నారు. చిరు వ్యాపారులకు బంగారం, ఇళ్లు, వాహనాలకు రుణాలు అందిస్తూ సంఘాన్ని బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఉపాధ్యక్షుడు అయిలయ్య, సీఈఓ తిరుమల, డైరెక్టర్లు పాల్గొన్నారు. తొగుట పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి జెండాను ఆవిష్కరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, సీఈఓ గంగారెడ్డి పాల్గొన్నారు. కోహెడ ప్యాక్స్ కార్యాలయంలో చైర్మన్ పేర్యాల దేవేందర్‌రావు జెండా ఆవిష్కరించి స్వీట్లు పంచారు. డైరెక్టర్లు బాలరాజు, సురేందర్‌రెడ్డి, సుగుణమ్మ, దేవయ్య, మణెమ్మ, లక్ష్మయ్య, సీఈఓ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: జెండాను ఆవిష్కరిస్తున్న శివయ్య

'ఆయిల్‌పామ్'తో అధిక ఆదాయం

ఏడీఏ పద్మ



సిద్దిపేటరూరల్: ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఏడీఏ పద్మ తదితరులు

సిద్దిపేటరూరల్/చిన్నకోడూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం పొందవచ్చని ఏడీఏ పద్మ రైతులకు సూచించారు. నారాయణరావుపేట మండల కేంద్రంతో పాటు జక్కాపూర్, గుర్రాలగొంది, గోపులాపూర్ గ్రామాల్లో సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను ఏఓ పరశురాంరెడ్డి, ఏఈఓలతో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై డ్రిప్‌ను అందిస్తున్నాయన్నారు. ఉద్యానశాఖ, ఉపాధి హామీ పథకం నుంచి ప్రోత్సహకాలు అందుతాయని, అంతర పంటగా వేరుశనగ, పెసర, మొక్కజొన్న, కూరగాయ పంటలు సాగు చేసుకోవచ్చని చెప్పారు. చిన్నకోడూరు మండల పరిధిలోని గంగాపూర్‌లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ పంటను మండల వ్యవసాయ అధికారి జయంత్ పరిశీలించారు. సాగులో కలుపు యాజమాన్యం, ఎరువులు, నీటి వినియోగంపై రైతులకు వివరించారు. రైతులు వరికి బదులుగా ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే ఇబ్బందులు

రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): నిబంధనలు పాటించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వ్యాపారులు, రైతులు సహకరించాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి కోరారు. వంటిమామిడి కూరగాయల మార్కెట్ యార్డు వద్ద రాజీవ్‌రహదారిపై గురువారం మార్కెట్ యార్డులో ములుగు ఎస్‌ఐ విజయ్‌కుమార్, మార్కెటింగ్ శాఖ అధికారులతో కలసి కమిషన్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు, రైతులు రహదారిపై కూరగాయల క్రయ, విక్రయాలు సాగిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తి వాహనదారులు ఇబ్బందులకు లోనవుతున్నారన్నారు. మార్కెట్ లోపలే క్రయ, విక్రయాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసాద్‌రావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, వంటిమామిడి మార్కెట్ సెక్రెటరీ రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు హరీశ్ పరామర్శ



సిద్దయ్య కుమారుడిని ఓదారుస్తున్న హరీశ్‌రావు

నంగునూరు(సిద్దిపేట): ఇటీవల మరణించిన పలువురు బీఆర్‌ఎస్ కార్యకర్తల కుటుంబాలను ఎమ్మెల్యే హరీశ్‌రావు గురువారం పరామర్శించారు. మగ్దుంపూర్‌లో పాకాల కనకయ్య, రాములు, సిద్దన్నపేటలో సిద్దయ్య, బాలయ్య కుటుంబ సభ్యులను ఆయన కలిసి ఓదార్చారు. అలాగే అంక్షాపూర్‌లో సీనియర్ జర్నలిస్ట్ నరోత్తంరెడ్డి తండ్రి మరణించగా అయన కుటుంబ సభ్యులను, నంగునూరు పురోహితుడు సాయినాథ్‌శర్మ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, సారయ్య, మలయ్య, వెంకట్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, రమేశ్‌గౌడ్, తిరుపతి, పురేందర్, కమాల్‌షరీఫ్, రాజుగౌడ్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌రత్నం తదితరులు పాల్గొన్నారు.

భార్యతో గొడవపడి..



వెంకటేశ్ (ఫైల్)

తొగుట(దుబ్బాక): భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంతరావు కథనం ప్రకారం.. తొగుటకు చెందిన ఆదిమూలం వెంకటేశ్ మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతడి భార్య జ్యోతి చుట్టు పక్కల అలాగే బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



వర్గల్(గజ్వేల్): నాచగిరి శ్రీలక్ష్మీనృసింహ క్షేత్రంలో గురువారం రాత్రి సామూహిక సహస్ర కార్తీక దీపోత్సవంలో భాగంగా జ్యోతులు వెలిగిస్తున్న మహిళలు